రూ. 2 కోట్లు ఖర్చు..నాణ్యత తీసికట్టు

- వింజమూరు-నెల్లూరుపాళెం రోడ్డు పనుల్లో కనికట్టు
- రెండు నెలలు తిరగక ముందే దెబ్బతింటున్న రోడ్డు
- మార్జిన్లలో మోకాలు లోతున ఏర్పడిన గుంతలు



వింజమూరు-చంద్రపడియ మధ్యన మార్జిన్లలో భారీ గుంతలు ఏర్పడి దెబ్బతింటున్న రోడ్డు

వింజమూరు (ఉదయగిరి): ఇంజనీర్ల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాల ప్రకారం కొత్తగా వేసిన తారు రోడ్డు కనీసం ఐదేళ్ల నుంచి ఏడేళ్లపాటు మన్నికగా ఉండాలి. కనీసం ఐదు నెలలు కూడా నాణ్యతగా లేకపోతే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు..పనులు చేయించిన ఇంజనీరింగ్ అధికారులా..పనులు చేసిన కాంట్రాక్టర్లలా..అన్నది అంతుచిక్కని ప్రశ్న. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై రోడ్డు పనుల్లో కనికట్టు చేసి నిధులు స్వాహాచేస్తే మన్నిక మూణ్నాళ్ల ముచ్చటగానే మిగులుతుంది. రోడ్డు నాణ్యత ప్రమాణాలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు..ప్రశ్నించే స్వరం లేని ప్రజానీకం ఉన్నంత కాలం ఈ పరిస్థితుల్లో మార్పు ఉండదు. అందుకు చక్కని ఉదాహరణ ఇటీవల కొత్తగా వేసిన విం జమూరు-నెల్లూరుపాళెం రోడ్డు.



చంద్రపడియ-రాజవోలు మధ్యన ఎర్రమట్టి పోయడంతో వర్షానికి దిగబడిన మార్జిన్

రెండు నెలలకే..

గతంలో వింజమూరు-నెల్లూరుపాళెం రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉండి ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. దీంతో ప్రభుత్వం రెండు నెలల క్రితం రోడ్డు పనులకు రూ.2కోట్లు కేటాయించింది. ఈ నిధులతో నెల్లూరుపాళెం నుంచి చంద్రపడియ వరకు 18 కిలోమీటర్ల మేర పూర్తిగా దెబ్బతిన్న రోడ్డును తొలగించి తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. చంద్రపడియ నుంచి వింజమూరు వరకు నాలుగు కిలోమీటర్ల మేర ప్యాచ్‌వర్కులు చేపట్టారు. ఈ పనులు జరిగేటప్పుడే నాణ్యత ప్రమాణాలపై పలువురు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అయినా కాంట్రాక్టర్ అధికారపార్టీకి అనుకూలం కావడంతో అధికారులు నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టర్ నాణ్యతను గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా పనులు చేపట్టాడు. తారురోడ్డుకు ఇరువైపులా మార్జిన్లను గ్రావెల్‌తో పటిష్టపర్చాల్సి ఉన్నా పక్కనే ఉన్న ఎర్రమట్టిని పోశారు. కనీసం రోలర్‌ను కూడా తిప్పలేదు. తారు రోడ్డు వేసే ముందు కంకర, డస్ట్‌పై నీళ్ల చల్లి రోలింగ్ కూడా చేయలేదు. దానిపైనే ఎంచక్కా తారు వేశారు. అప్పుడు మాత్రం చూసేందుకు రోడ్డు చాలా బాగా కనిపించింది. అధికారులు సైతం బిల్లులు చేశారు. ఎవరి వాటాలు వారికిచ్చి కాంట్రాక్టర్ జేబులు నింపుకొన్నారు.

వర్షంతో బయటపడిన డొల్లతనం

గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పనుల్లో డొల్లతనం బయటపడింది. రోడ్డు మార్జిన్లలో పోసిన ఎర్రమట్టి కుంగిపోయి మోకాలులోతు గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై అక్కడక్కడ వేసిన ప్యాచ్‌వర్కులు లేచిపోయి గుంతలుగా మారాయి. కొత్తగా వేసిన తారురోడ్డు సైతం అక్కడక్కడ కుంగిపోయింది. తారు నాణ్యతగా లేకపోవడంతో మూడునెలలకే రోడ్డుపై నెర్రలు కనిపిస్తున్నాయి. రోడ్డుమార్జిన్లలో సైతం తారురోడ్డు దెబ్బతింటోంది. వేసవిలో కురిసే చిన్నపాటి వర్షానికే రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే వానా కాలంలో ఎలా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు. కొద్ది రోజుల్లోనే రోడ్డు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లలో పోసిన ఎర్రమట్టిని తొలగించి దాని స్థానంలో నాణ్యత గల గ్రావెల్‌ను పర్చి రోలింగ్ చేస్తే కొంతకాలం రోడ్డు గుంతలు పడకుండా ఉంటుంది. మరి అధికారులు, పాలకులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే..

క్లుప్తంగా

మేకపాటిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం కలిశారు. బస్టాండ్ సెంటర్ వద్ద నాయకులతో మమేకమైన మేకపాటి మండలంలోని తాజా రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి భవిష్యత్‌లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రస్తుత కష్టకాలంలో పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఉదయగిరి మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు యస్దాని, గడియాల్చి యస్దాని, ఉప్పుటూరి హరి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి గ్రామోత్సవం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం భట్టువారిపాళెం రోడ్డులో నూతనంగా నిర్మించిన పంచముఖి ఆంజనేయస్వామి మందిరం వద్ద విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను రెండ్రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల పురోగతిపై ఏపీఓ శ్యామల ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నిత్యం పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. పని ప్రదేశంలో కొలతల ప్రకారమే పనులు చేపట్టి గిట్టుబాటు వేతనాలు శ్రామికులకు అందేలా చూడాలన్నారు. బినామీలకు మస్టర్లలో చోటు కల్పిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పంచాయతీల వారీగా ఉపాధిహామీ పనుల పురోగతిపై సమీక్షించారు. నిర్ణీత గడువులోగా ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మినీట్రక్కు బోల్తా



సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి సమీపంలో సోమశిల-ఆత్మకూరు ప్రధాన రహదారిపై ఓ మినీట్రక్కు బుధవారం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..మర్రిపాడు మండలం పల్లిపాడులోని ఎస్వీ బ్రాయిలర్స్ కోళ్ల ఫారానికి సంబంధించిన మినీట్రక్కులో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ముగ్గురు మద్యం సేవించి ఉన్నారు. అనంతసాగరం మండలంలోని చికెన్‌షాపులకు కోళ్లను వేసి తిరిగి వెళ్తున్న క్రమంలో వాహనం తోలే విషయంలో వారి మధ్యన వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో పాతదేవరాయపల్లి సమీపంలో ఓ వ్యక్తి స్టీరింగ్‌ను గట్టిగా పక్కకు లాగడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకువెళ్లి పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ కొంత భాగం దెబ్బతింది. వాహనంలోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

ఏఎస్‌పేట దర్గాను దర్శించుకున్న మాజీ మంత్రి



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సయ్యద్ సత్తార్ అలీ కుటుంబసభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. మత గురువు ఫయాజ్‌అహ్మద్ దగ్గరుండి ప్రత్యేక దువా, ప్రార్థనలు చేయించారు.

పాదర్తికి సత్కారం

కావలి (జలదంకి): జ్ఞానీ జైల్‌సింగ్ మెమోరియల్ అవార్డును అందుకున్న కావలికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు పాదర్తి నాగరాజును పట్టణ బంగారు, కుదువ వ్యాపారుల అసోసియేషన్ల సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. శాలువాలతో సత్కరించి సాయినాథుని జ్ఞాపికను అందజేసి అభినందించారు. కావలి బంగారు వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు మొగిలిపల్లి రాజా, గౌరవాధ్యక్షుడు నల్లూరి రామ్‌ప్రసాద్, రాష్ట్ర బంగారు వ్యాపారుల అసోసియేషన్ కార్యదర్శి నల్లూరి రమేష్, కుదువ వ్యాపారస్తుల అధ్యక్షుడు కోట రమేష్, కార్యదర్శి వేముల శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవచూపాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

సోమశిల: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అన్నారు. అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత ఇటీవల పాకిస్తాన్‌తో యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ల ఆత్మశాంతి కోసం మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం అధికారులు శాఖలవారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నబ్బయ్య వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేపట్టిన ముందస్తు చర్యలను తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో జనవరి నుంచి 25 టీబీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. గతేడాది కన్నా ఎక్కువగా కేసులు నమోదయ్యాయని, మీ ప్రాంతంలో దగ్గు, బరువు తగ్గిపోతున్న వారిని గుర్తించి ఆస్పత్రిలో పరీక్షలు చేయించాలని సూచించారు. బొమ్మవరం సర్పంచ్, కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఇటీవల కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే క్రమంలో పలుచోట్ల పైపులైన్లు పగులగొట్టడంతో సుమారు ఐదు రోజుల పాటు తాగునీటి కొరత ఏర్పడిందని తెలిపారు. వీధి దీపాలు తీసేయడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నిస్తే అభివృద్ధి పనులు చేస్తున్నామని వెటకారంగా సమాధానం చెప్పారని సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రెండోపంట సాగు చేసే రైతులు అక్టోబర్ రెండోవారంలోగా పంటను ముగించుకోవాలని తెలిపారు. 142 నుంచి 145 రోజులకు చేతికి వచ్చే కేఎన్ఎం రకం సాగు చేసుకోవాలని సూచించారు. త్వరలో జింక్ అందుబాటులోకి రానుందని తెలిపారు. కాగా మంగుపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎంపీటీసీ కాలువ నరసింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పేర్లు లేకుండా సర్పంచ్ పేరుతో మాత్రమే శిలఫలకాన్ని ఏర్పాటు చేయడంపై అధికారులను నిలదీశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే ప్రొటోకాల్‌ప్రకారం నూతన శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు పంపించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మట్టిరోడ్డు కాదు.. ఆర్‌అండ్‌బీ రోడ్డే



సోమశిల-కమ్మవారిపల్లి మధ్యన బురదమయంగా ఉన్న రోడ్డు

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల నుంచి కమ్మవారిపల్లి శివారు వరకు ఆర్‌అండ్‌బీరోడ్డు దారుణంగా ఉంది. తారు పూర్తిగా లేచిపోయి భారీ గుంతలు ఏర్పడి మట్టిరోడ్డును తలపిస్తోంది. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కార్లు, ద్విచక్ర వాహనదారులు నరకాన్ని చవిచూస్తున్నారు. ఈ మార్గంలోనే సోమ శిల జలాశయ సందర్శనకు పర్యాటకులు వస్తుంటారు. రోడ్డు అధ్వానంగా తయారవడంతో పర్యాటకుల రాక తగ్గుముఖం పట్టింది. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ సైతం రోడ్డు సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ అన్వేష్ దృష్టికి తీసుకొచ్చి సిమెంట్ రోడ్డును మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నేడు హనుమజ్జయంతి వేడుకలు

ఆత్మకూరురూరల్: పట్టణం పరిధిలోని బైపాస్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏటూరు సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి విశేషాభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అభయాంజనేయస్వామి కల్యాణోత్సవం, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు 60 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహానికి పాలాభిషేకం, 6.30 నుంచి 7.30 గంటల వరకు ఆకు పూజ, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు భరత నాట్యం, రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 4.30 గంటల వరకు వెంకట్రావుపల్లికి చెందిన గుండాల పెంచలరెడ్డి భజన బృందం ఆధ్వర్యంలో పండరి భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. శుక్రవారం వేకువజామున 4.30 నుంచి 5 గంటల వరకు అగ్నిగుండం, పదచలనం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని అభయాంజనేయస్వామి కృపాకటాక్షాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

సంగం: మండల కేంద్రమైన సంగంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ ఏడీఏ పరిశుద్ధరామయ్య, ఏఈ సుధీర్ ఆధ్వర్యంలో ఇళ్లు, దుకాణాల్లోని మీటర్లను తనిఖీ చేశారు. ఎవరైనా అదనపు లోడ్ వినియోగిస్తున్నారా..విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారా అని పరిశీలించారు. విద్యుత్ చౌర్యం జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్‌మెన్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి ప్రజాసమస్యలు

వరికుంటపాడు: మండలంలోని పలు పంచాయతీల్లో బుధవారం నిర్వహించిన టీడీపీ గ్రామ కమిటీ సమావేశాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సిమెంట్‌రోడ్లు, వాటర్ ప్లాంట్లు నిర్మించాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు.

హనుమాన్ శోభాయాత్రపై ప్రచారం

ఆత్మకూరురూరల్: పట్టణంలో ఈనెల 25న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ప్రచార కమిటీ సభ్యులు కోరారు. మండలంలోని బండారుపల్లి, కనుపూరుపల్లి, మురగళ్ల, నల్లపరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో బుధవారం వారు విస్తృత ప్రచారం నిర్వహించారు.

వీరాంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం



దుత్తలూరు: ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న భక్తులు

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో వీరాంజనేయస్వామి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, కలశస్థాపన, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఉత్సవ విగ్రహాన్ని గ్రామం నుంచి రోడ్డుపై ఉన్న ఆలయానికి చేర్చారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

కావలి (జలదంకి): కావలి మండలం మద్దూరుపాడులోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన బుధవారం ఆలయ అర్చకులు దీవి రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామికి డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి ఆలయ కమిటీ సభ్యులు గుత్తికొండ కిషోర్ బాబు, పోతుగంటి శ్రీధర్, మట్టా వెంకట శివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పల్లకిసేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



ఆత్మకూరులో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వింజమూరులో..

ఆత్మకూరురూరల్: దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిన్నవయసులో భారత ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ దేశానికి దశ, దిశ చూపారని కొనియాడారు. దేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించారన్నారు. యువతను రాజకీయాల వైపు ప్రోత్సహించేందుకు ఓటు హక్కు వయోపరిమితిని 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారన్నారు. పోలియో రహిత సమాజం కోసం పోలియో డ్రాప్స్‌ను తీసుకొచ్చారని తెలిపారు. యువజన కాంగ్రెస్ నాయకులు మణికంఠ, ఖాజాసుల్తాన్, ఇమ్రాన్, వెంకి, సురేష్, వినయ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వింజమూరులో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశానికి అందించిన సేవలను పలువురు నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీఆర్వోల వినతి



కొండాపురం: మండల తహసీల్దార్‌ను వీఆర్వోలు బుధవారం కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే తాము పనిభారంతో ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. ప్రభుత్వం కొత్తగా జీఓనంబర్-4 తీసుకొచ్చి రెండు సచివాలయాలను కలిపి ఒకే సచివాలయంగా ఏర్పాటు చేసే క్రమంలో ఒక సచివాలయంలోని వీఆర్వోను ఇంకో సచివాలయంలో సర్వేయరుగా చూపించారన్నారు. దీంతో తాము పనిభారంతో విధులు సక్రమంగా నిర్వహించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు తమ సమస్యలను పరిగణలోకి తీసుకుని జీఓ నంబర్4 పరిధి నుంచి తమను తొలగించాలని కోరారు. వీఆర్వోలు దమ్ము మాలకొండయ్య, శివకుమార్, కొండయ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిరెడ్డి కుంట చెరువుకు గండి

బెడుసుపల్లిలోని పిచ్చిరెడ్డికుంట చెరువుకు గండిపడడంతో సాగునీరు వృథాగా పోతోంది. చెరువు కింద 50 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల అడపాదడపా కురిసిన అకాల వర్షాలకు చెరువులో సాగునీరు చేరింది. అయితే చెరువు కట్ట బలహీనంగా మారి నెర్రెలు బారడంతో పైభాగంలో గండిపడింది. దీంతో సగం నీరు వృథాగా పొలాల్లోకి వెళ్లింది. వేసవిలో కురిసే అకాల వర్షాలకు చెరువులో నీరు చేరితే కట్ట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. అందువల్ల సంబంధిత శాఖల అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– సీతారామపురం



చెరువు కట్టకు పడిన గండిని చూపుతున్న రైతు



గండిపడడంతో పై భాగంలో కుంగిన చెరువుకట్ట

పీహెచ్‌సీకి వెళ్లాలంటే తప్పని పాట్లు



హైవే నిర్మాణంతో కిందకు చేరిన మెయిన్‌గేట్



రోడ్డుపైకి వెళ్లేందుకు అవస్థ పడుతున్న వృద్ధుడు

దుత్తలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. జాతీయ రహదారిని బాగా ఎత్తుగా నిర్మించడంతో పీహెచ్‌సీ మెయిన్‌గేట్ బాగా కిందికి చేరింది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు హైవేను దిగి పీహెచ్‌సీలోపలికి వెళ్లేందుకు నానా యాతన పడుతున్నారు. దీనికితోడు చిన్నపాటి వర్షానికే మట్టి బురదమయంగా మారుతుండడంతో జారిపడుతున్నారు. మరోవైపు ఆస్పత్రి గేట్ చిన్నదిగా ఉండడం...గేట్‌పై పీహెచ్‌సీ నేమ్ బోర్డు తగులుతుండడంతో అత్యవసర వేళ 108 వాహనం కూడా లోపలకు వెళ్లే పరిస్థితి లేదు. ఇటీవల వైద్యశాలకు మందులు సరఫరా చేసే వాహనం వచ్చినా రోడ్డుపైనే నిలిపి అక్కడి నుంచే లోపలికి మోసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వైద్యశాలకు రహదారి నిర్మించాలని రోగులు, వైద్యసిబ్బంది కోరుతున్నారు.

–దుత్తలూరు

గిలక బావి..ఓ మధుర జ్ఞాపకం



కొండాయపాళెంలో నిరుపయోగంగా మారిన గిలకబావి

గతంలో ప్రతి ఇంట్లోనూ..ఊరి మధ్యన గిలక బావులు ఉండేవి. ప్రజలు వాటి వద్దకు వెళ్లి ముచ్చట్లు చెప్పుకుంటూ నీటిని తెచ్చుకుని వినియోగించుకునే వారు. బావిలోని నీటిని తోడుతున్నప్పుడు లయబద్ధంగా కదులుతూ గిలక చేసే సవ్వడులు, కమ్మనైన నీరు మాటల్లో వర్ణించలేనివి. కాలంతో పాటు ప్రతిఇంట్లో బోర్లు, మోటార్లు రావడం..భూగర్భజలాలు అడుగంటడంతో ఒకనాడు ప్రజల దాహార్తిని గిలకబావులు నేడు నిరుపయోగంగా మారి ఓ మధుర జ్ఞాపకంగా మిగిలాయి.

– సీతారామపురం